

# చిత్తడి నేల..కుక్కల మంద

ఎవరైనా...ఒట్టి నగ్నశరీరంతోనే పుట్టే మనిషి...క్రమంగా ఎదుగుతూ ఒంటిమీది బట్టలను, ఆహార్యాన్ని, చదువును, జ్ఞానాన్ని, ఆస్తులను, సంపదలను, కీర్తి ప్రతిష్ఠలను...వీటన్నింటినీ సమాజంనుండే పొందుతున్న మనిషి...బురదలోనుండి తామరపువ్వులా తను అనివార్యంగా సమాజంనుండే వికసిస్తున్న సత్యాన్ని ఏనాడూ గుర్తుంచుకోకుండా...ఏంజేస్తున్నాడు..ఎటుపోతున్నాడు..ఎలా ప్రవర్తిస్తున్నాడు.,

అసలు ఈనాటి మనిషి సామాజిక స్పృహను కలిగి ఉంటున్నాడా...?

మనిషి రూపంలో ఉన్నవాళ్ళందరూ నిజంగా మానవ లక్షణాలను కలిగి ఉంటున్నారా..?

* * *

రాత్రంతా ఒకటే ముసురు.

నిదురలేదు ఒక్క క్షణం కూడా

అంటుకున్న అడవిలా శరీరమంతా ఏదో అంతర్దహనం. ఏదో అశాంతి.. ఏదో ఉద్విగ్నత..ఏదో దుఃఖం.

అప్పుడే తెల్లవారుతోంది. గుడ్డి వెలుగు..గుడ్డి చీకటి.

జస్టిస్ బాలకృష్ణ మెడికల్ కాలేజ్ గేట్‌లోకి కారును పోనిచ్చి, ఆంధ్రాబ్యాంక్ ఆవరణలో కారును పార్క్‌చేసి, గొడుగు తీసుకుని దిగి...డోర్స్ లాక్ చేసి...

వాచీ చూసుకున్నాడు. ఆరూ పది.

ఈ మెడికల్ కాలేజ్..మార్నింగ్ వాక్..పన్నెండేళ్ళ అనుబంధం...నడక... నడక...ఆగని నడక, అలసట ఎరుగని నడక...జీవితమంతా నిర్విరామమైన నడక...నడవలేకుండా ఉండలేని వ్యసనమైన నడక.,

బాలకృష్ణ నడక ప్రారంభించాడు..ఎదురుగా ఒక జ్ఞానశిఖరంలా మెడికల్ కాలేజ్ సమున్నతమైన భవనం...శిఖరంపై...తడిచినా రెపరెపలాడ్తున్న జాతీయ జెండా..రోడ్డుకిరువైపులా చెట్లు..చల్లనిగాలి..సన్నని వర్షపు తుంపర...తడిచిన రోడ్డు...రోడ్డుపై రాత్రినుండి రాలిన పొన్నపూల జాడలు...వెరసి గాలినిండా ఒక జీవభరితమైన పరిమళం.

విప్పిన గొడుగు..అలవాటుగా పడ్తున్న అడుగులు...స్పోర్ట్స్ షూ లయ.. చుట్టూ ఎక్కడా మనిషి సంచారంలేదు. రోజూ ఎందరో వాకర్స్‌తో హడావిడిగా ఉండే రోడ్లు...నిర్మానుష్యంగా..వర్షం వల్ల కావచ్చేమో.

పాల బూత్..స్టాఫ్ క్వార్టర్స్..వుమెన్స్ హాస్టల్...వరుసగా వృక్షాలు. ఇటువేపు అడవిని తలపించే దట్టమైన చెట్ల గుబుళ్ళు.

ఎదురుగా విశాలమైన గ్రౌండ్..పన్నెండేళ్ళుగా తన పాదాలను మోస్తున్న భూమి. తనకు ఎంతో ఇష్టమైన తల్లివంటి పచ్చిక బయళ్ళతో ట్రాక్...

చిత్రం..ఎవరూ లేరు..ఒక్క మనిషి కూడా.,

గొడుగుపై గమ్మత్తుగా చినుకుల చప్పుడు...నిశ్శబ్ద సౌందర్యం..ఏదో తెలియని మత్తు.

చటుక్కున ఎక్కడినుండో ఒక కుక్కలమంద..ఎదురుగా ఆడిటోరియం దగ్గర్నుండి రావడం కనిపించింది బాలకృష్ణకు. భౌ భౌ మని అరుస్తూ... ఒకదాన్నొకటి కరుచుకుంటూ, మొరుగుతూ దాదాపు ఏడెనిమిది కుక్కలు. తనవేపే వస్తూ వస్తూ..ప్రక్కన చెట్టుకింద నిలబడి ఒకదానిపై మరొకటి ఎగబడ్తూ ఇంకా ఇంకా మొరుగుతూ...గోల...కుక్కలగోల. చికాకు కల్గిస్తూ, బీభత్సంగా కుక్కలగోల.

చటుక్కున ఎందుకో బాలకృష్ణకు భారతదేశపు పార్లమెంటు, అసెంబ్లీ

సమావేశాలు, టి.విల్లో మేధావుల చర్చలు, రాజకీయ నాయకుల ప్రచారసభల వికృతి..అన్నీ జ్ఞాపకమొచ్చాయి.

కుక్కలు ఇలా ఇంత బీభత్సంగా ఎందుకు కలహించుకుంటాయి.. మొరుగుతూ మనపైనబడ్తాయా అన్నంత భయాన్ని కల్గిస్తూ ఇంత తీవ్రంగా ఎందుకు విరుచుకుపడ్తాయి..

కుక్కలు..పిచ్చికుక్కలు..గజ్జికుక్కలు..ఊరకుక్కలు..రకరకాల కుక్కలు... కుక్కల మంద..

కుక్కల మంద...అటు..వాలీబాల్ గ్రౌండ్ దిక్కు వెళ్ళిపోయింది అరుచుకుంటూ..,

బాలకృష్ణ వాకింగ్ ట్రాక్‌లోకి ప్రవేశించి..తనకిష్టమైన..పచ్చని గడ్డిపైనుండి నడవడం మొదలెట్టాడు. రెండ్రోజులుగా కురుస్తున్న ముసురువల్ల నేల మెత్తగా నాని...లుసలుస..చిత్తడి చిత్తడి..జారుడు జారుడు.

ఐనా గడ్డిపైనుండి నడుస్తూంటే అదో మహానందంతో నిండిన అనుభూతి..చిత్తడి నేలపై మెత్తని బూట్లు, నీటిజల, గడ్డిస్పర్శతో కలగలిసిన ఓ చిత్రమైన చప్పుడు.

గ్రౌండ్‌లో తనొక్కడే. చేతిలో గొడుగు..ఒంటరి నడక..నిశ్శబ్దం..

చిత్తడినేల..దూరంగా కుక్కలమంద...గోల.

అడుగులు పడ్తూనే ఉన్నాయి.

నడవాలి...నడవాలి..ఒకటి.. రెండు...ఆరు రౌండ్లు..నలభై నిమిషాలు.. రాను పది, మళ్ళీ కారు దగ్గరికి పోను పది...మొత్తం గంట.

'మీ ఆరోగ్యాన్ని పరిపూర్ణంగా రక్షించేది ఈ ప్రతిరోజూ గంట నడకే..' తన పర్సనల్ డాక్టర్ మురళీకృష్ణ అంటూండడం జ్ఞాపకమొచ్చింది.

కాని..ఈరోజు...నడక కొత్తగా, ఒంటరిగా, వింతగా..వర్షంలో చిత్రంగా.. మనసునిండా ఓ ప్రళయ భీకరమైన మధనతో...రాత్రంతా నిద్రపోలేని వ్యాకులత...

ఏమిటి..ఏమిటిది...ఏంజేయాలిప్పుడు తను..?

'పంటమొక్కల్లోనుండి కలుపుమొక్కలను ఏరేయడం..సమాజాన్ని కలుషితం చేస్తున్న చెత్తను ఊడ్చేయడం..అన్‌వాంటెడ్‌ను నిర్మూలించడం..ఇదంతా సమాజ నిర్మాణకార్యక్రమంలో ఒక అతిముఖ్యమైన బాధ్యతతో కూడిన చర్య అని నేను భావిస్తున్నాన్సార్..అందుకే..'

చాలా స్పష్టంగా ఆ యువకుని మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

అతని ముఖం ఎంతో నిర్ధారితంగా, నిశ్చలంగా, ప్రకాశవంతంగా కనిపిస్తోంది.

మనిషిలో ధృడమైన నిర్ణయం...ఏ పశ్చాత్తాపమూ లేని నిర్భయత్వం.

నిన్న సాయంకాలం ఐదుగంటల ప్రాంతంలో..ఇక కోర్టు మూసివేయబోతున్నపుడు..హడావిడిగా పోలీసులు ప్రవేశపెట్టిన ఆ యువకుని ముఖంలో.,

ఎంత కాంతి...ఎంత వర్చస్సు...ఎంత తీక్షణత..ఎంత జీవకళ., ప్రక్కనుండి కుక్కలమంద మొరుగుతూ చేస్తున్న గోలలో...చిత్తడి నేలపై నడుస్తున్న బాలకృష్ణకు..నిన్నటి ఉదంతం ఒక కణకణలాడ్తున్న నిప్పుకణికలా జ్ఞాపకమొచ్చింది.

## 2

ఏదో కేస్‌తాలూకు వాదనలు వింటూండగానే ఒక వార్త తన చెవిన పడింది.

నగరంలో ఎవరో గుర్తుతెలియని యువకుడు పదకొండు గంటలకు నగర ఎం.పి. ఇంట్లోనుండి బయటకు వచ్చి కారెక్కుతూండగా పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో పిస్టల్‌తో కాల్చి చంపి ఆటోలో పరారయ్యాడు.

అక్కడ అతనొక కవర్‌ను వదిలి వెళ్ళాడు. పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకుని విప్పితే...'ఈ దిక్కుమాలిన దేశంలో రాజకీయాలు ఎంత భ్రష్టుపట్టిపోయాయంటే..ఎంపీలంటే జాతీయస్థాయి కాంట్రాక్టర్లు..ఎమ్మెల్యేలు రాష్ట్రస్థాయి కాంట్రాక్టర్లు..మున్సిపల్ కార్పొరేటర్లందరూ నగర కాంట్రాక్టర్లు. అధికారులూ, రాజకీయ నాయకులూ కుమ్మక్కయి ప్రజాధనాన్ని కోట్లకుకోట్లు స్వాహా చేస్తూ, గాలికి కొట్టుకుపోయే రోడ్లు, వానకు కొట్టుకుపోయే డామ్‌లు, ప్రారంభం కాకుండానే కూలిపోయే ఫ్లైఓవర్లు..అంతా నాసిరకం..దోపిడి..దోపిడి.. అందినకాడికి భోంచేసే నీతిహీనత..వీడికి వందా ఇరవై కోట్ల ఆస్తి ఉంది.. వివరాలు దీంతో జతపరుస్తున్నాను. విచారణ జరిపించుకోండి. కలుపుమొక్కను పీకేస్తున్నాను..ఆదిత్య.'

పన్నెండు గంటలు...

నగరంలో మరో హత్య...రెడ్డికాలనీలో...పెద్ద ఆధునాతన రెండుకోట్ల విలువైన బిల్డింగ్ వాకిట్లో...ఊయలలూగుతున్న సినీ నిర్మాత...శేఖర్‌బాబు...అదే రీతి..అదే తరహా హత్య...అదేరకంగా ఆటోలో పరార్..అదేవిధంగా కవర్లో లేఖ.,

'వీడు మొన్న ఒక సినిమా తీశాడు..'ఊర్మిళా టీచర్..అన్నీ నేర్పుతుంది' పేరు...తొమ్మిదోక్లాస్ పోరగాండ్లు టీచర్‌తో ప్రేమ...తోటి ఎనిమిదో తరగతి ఆడపిల్లలతో ప్రేమ...ఈ దిక్కుమాలిన లంచగొండి సమాజంలో వీటన్నింటికీ క్లీన్ సర్టిఫికేట్లిచ్చే సెన్సార్ బోర్డ్స్. వీడి సినిమాలే ఇదివరకు 'ఆంటీ ఐ లవ్ యు', 'టెన్త్‌క్లాస్'...'ఇంటర్..ఎంటర్', 'నీకు గర్ల్‌ఫ్రెండ్ లేదా?' హంతకుడు ఒక్కణ్ణి

మాత్రమే చంపగలడు. వీడు సమాజంయొక్క పునాదియైన ఒక తరాన్నే చంపి తీయని విషాన్ని యువకుల రక్తంలోకి ఎక్కిస్తున్నాడు..స్త్రీని నిస్సిగ్గుగా నగ్నంగా ప్రదర్శిస్తున్న వీడి దుశ్చర్యలను ప్రభుత్వాలూ, మహిళా సంఘాలూ పట్టించుకోని పేడి వ్యవస్థలో..ఈ చెత్తను ఊడ్చేయడం నా ధర్మంగా భావిస్తూ వీడ్ని ఖతం చేస్తున్నాను. హైస్కూల్, ఇంటర్ పోరగాండ్ల డబ్బులను దోచుకుంటున్న వీడి ఆస్తుల విలువ ఏభై ఆరుకోట్లు. వివరాలు జతపరుస్తున్నాను. విచారించుకోండి...ఆదిత్య'

మధ్యాహ్నం రెండు గంటలు...

శివనగర్‌లో ఒక హత్య...రెండు నెలల క్రితం పోలీసులకు లొంగిపోయిన నక్సలైట్ రాజిరెడ్డి తల పిస్టల్ తూటాకు ముక్కలు ముక్కలైపోయింది..మెరుపు వేగంతో చంపి...మళ్ళీ అదేరకంగా ఆటోలో పరారు..శవం దగ్గర విడిచిన ఉత్తరం.,

'కోవర్ట్..ఇంటి దొంగ..నినదించే అడవుల్లో విప్లవమూర్తుల నడుమకు అమాయకునిగా చేరి, నమ్మబలికి ఒదిగి ఒదిగి, ఎదిగి ఎదిగి..రహస్యాలను పోలీసులకు చేర్చి చేర్చి...కోట్ల రూపాయల డంప్‌ను స్వాహా చేసి..లొంగి ... ప్రజాజీవన స్రవంతిలో కలిసి...రివార్డు డబ్బు తీసుకుని... సెటిల్‌మెంట్స్. భూకబ్జాలు..ఇవే వ్యాపకాలుగా బతుకుతూ..వీడి ఆస్తివిలువ ఇరవై ఎనిమిది కోట్లు...చదివింది పదవతరగతి..మాటలు విప్లవాలు. పాటలు ఉద్యమాలు..చేతలు పీతిగుడ్డల రోతలు. వీడికి శిక్ష వేయాల్సిన పోలీసులే రక్షకులుగా మారిన తర్వాత... నేరమే అధికారమౌతోంది..దుష్టాంగ నిర్మూలన అనివార్యం. లేకుంటే శరీరం కుళ్ళిపోతుంది. అందుకే ఈ 'ఆపరేషన్ క్లీన్'. వీడి అక్రమాల వివరాలు జతచేసిన లేఖలో..ఆదిత్య'

సరిగ్గా నాల్గు గంటలు.,

జిల్లా రోడ్లు మరియు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పద్మావతి హత్య..

"స్త్రీ అంటేదేవత..మహిళ అంటే మాతృమూర్తి. ఆడదంటే దయామయి అని విశ్వసించే పవిత్ర పుణ్యభూమిలో..తెల్లారింది మొదలు..సిమెంటు తినుడు, డాంబర్ తినుడు, ఇనుము తినుడు, ప్రాజెక్టులను తినుడు..టెండర్లన్నీ మాయ.. అంచనాలన్నీ దొంగ లెక్కలు..వందకోట్ల ప్రాజెక్టు ఎస్టిమేషన్ నూటా యాభై కోట్లు.. బహిరంగ బకాసుర తిండి. పల్లెటూళ్ళలో రోడ్లన్నీ కంటితుడుపు. కాగితాలపైనే పనులు. అసలే లేని అనేక నిర్మాణాలు కాగితాలపైననే ప్రారంభమై, పూర్తయి, తనిఖీయై, లక్షలు..కోట్లు చెల్లింపులై..వాటాలు వాటాలుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇఇలు, ఎఇలు, వర్కిన్‌స్పెక్టర్లు..అందరూ పంచుకుని..సర్వేజనా సుఖినోభవంతు..ఎవడబ్బసొమ్ము..ఎన్నాళ్ళీ తిండి..నిశ్శబ్దంగా నిలబడి ఈ కోట్లకొద్ది రూపాయలను పన్నులరూపంలో కట్టిన ప్రజలు గమనిస్తున్నారనే స్పృహ లేదు.

నిర్లజ్జ..నిర్భయం. విచ్చలవిడిగా పెరిగిన లంచగొండితనంతో పోటీపడి తిని తిని... ఈమె ఆస్తి ఎనభై కోట్లు...పేకమేడలాంటి ఈ చెదలుపట్టిన అవినీతి భవనం కూలిపోవాల్సిందే...శిక్ష నిర్ధారించనైనది.. ఆదిత్య"

నాల్గున్నర గంటలు.,

ఎఎస్పీ వెంకట్రాములు హత్య..

ఒక కవర్..రెండే వాక్యాలు.

'పోలీసంటే రక్షకుడు. కాని వీడు భక్షకుడు. అందుకే ఈ శిక్ష.

వీడి ఆస్తులు నూటా పదికోట్లు. లిస్ట్ ఎంక్లోజ్డ్..ఆదిత్య'.

నాల్గూ యాభై నిముషాలు.,

ఎస్పీ ఎదుట ఆదిత్య..ఆటోలో తనకుతానుగా వచ్చి...పిస్టల్‌ను అందజేసి స్వచ్ఛందంగా లొంగిపోయి.,

అప్పటిదాకా దద్దమ్మల్లా గజగజలాడిన పోలీసులు..ఆదిత్యను అరెస్ట్ చేసి.. నాల్గవ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా..

అప్పుడూ..వర్షమే..ఆకాశం కుప్పకూలి రోదిస్తున్నట్టు.,

బోనలో..నిశ్చలంగా నిలబడ్డ స్వామి వివేకానందునిలా..ఆదిత్య

డాక్టరేట్ పట్టా పొందినవాడు..నవ్వు రాజిల్లెడు మోమువాడు.. పరిత్యాగియైన కడు బీదవాడు..మూర్తీభవించిన సమున్నత మానవ లక్షణములన్నీ నిండుగా ఉన్నవాడు..

...అన్నాడు..స్పష్టంగా, నిర్మలంగా..సూటిగా...నిజాయితీగా.,

"యువరానర్..అన్నీ హద్దులు మీరుతున్నాయీదేశంలో. మితిమీరిన స్వేచ్ఛ..విశృంఖలత్వంగా మారుతున్న స్వాతంత్ర్యం. బహిరంగంగానే కళ్ళముందు జరుగుతున్న దోపిడి. విచ్చలవిడి లంచగొండితనం..నిర్వీర్యమై ప్రేక్షకపాత్ర వహిస్తున్న ప్రభుత్వ వ్యవస్థ..ఒక్కొక్క అంగమే కుళ్ళిపోతున్న ఈ దేశ శరీరవ్యవస్థ..

ఒక మేజర్ ఆపరేషన్ జరుగవలసి ఉంది యువరానర్..

సైకిల్‌వంటి ఈ సమాజంయొక్క సకల భాగాలూ పాడైపోయాయి. చైన్‌పోయింది. చక్రాలు పోయాయి. హాండిల్ పోయింది. సీట్ పోయింది. పెడల్స్ పోయాయి..దీన్ని మరమ్మత్తు చేయడమిక అసాధ్యం. సిస్టమ్ ఈజ్ ఇర్రిపేరబుల్. వ్యవస్థనే మార్చాలిక.

ఇప్పుడిక హింసాపూరిత, విధ్వంస పూరిత శస్త్రచికిత్స జరగాలి.

ప్రజలను ఉత్తమ పౌరులుగా, దేశభక్తులుగా, యోధులుగా తీర్చి దిద్దవలసిన ప్రభుత్వాలు ఓట్లకోసం వాళ్ళను సోమరిపోతులుగా, పనిదొంగలుగా, తాగుబోతులుగా మారుస్తోంది. ప్రజలు అవినీతిని తమ జన్మహక్కుగా భావించి విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. ఉద్ధరించవలసిన మీడియా ధర్మాన్ని మరిచి

వ్యాపారాన్నే లక్ష్యం చేసుకుని కులుకుతోంది.. అంతా.. అనిశ్చితి.. అస్తవ్యస్తం.. అరాచకత్వం.. ఈ దేశం దారి తప్పుతోంది. జరుగవలసిందేదో జరుగకుండా జరుగకూడనివన్నీ వడివడిగా జరుగుతున్నాయి.

మనిషికి తన దేశంపై భక్తన్నా ఉండాలి.. లేదా దేశమంటే భయమన్నా ఉండాలి.

భక్తి ఎలాగూ లేదు. భయాన్ని ఇక నేను సృష్టిస్తున్నాను.

ఇకముందు అవినీతికి పాల్పడేవాడెవడైనా.. యింకా నావెనుక ఉన్న వందలమంది 'ఆదిత్య'ల హృదయాగ్నికి బలై మలమలా మాడి నశించిపోతారు.. నిర్మూలన, నిర్మాణం ప్రారంభమైంది యువరానర్.."

## 3

జస్టిస్ బాలకృష్ణ ఆరవ రౌండ్ నడకను ఆపి.. టైం చూచుకున్నాడు.

ఏడు గంటలైంది.

అప్పటినుండి వినబడ్డ కుక్కలగోల గురించి.. అటు ఇటూ గమనించాడు.

ఎక్కడా కుక్కల జాడలేదు.. మంద ఎటో నిష్క్రమించింది.

అతనా క్షణం.,

'హత్య'ను శరీర సంరక్షణార్థం దుష్టాంగ నిర్మూలన క్రమంలో అనివార్యంగా జరుపవలసిన శస్త్రచికిత్సగా, సహేతుకమైన హత్యచేసిన వ్యక్తిని ఆరోగ్య ప్రదాతయైన వైద్యునిగా పునర్నిర్వచించవలసిన ఒక చారిత్రాత్మక సందర్భం గురించి స్పష్టమైన నిర్ణయానికొచ్చాడు.

ఆకాశంలోకి చూచాడు ఎందుకో.. అప్రయత్నంగానే.

నిర్మలంగా ఉంది.

వానకూడా వెలిసింది.